క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

మహమ్మదాబాద్: మండలంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భిక్షపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3గంటలకు స్థానిక మండల కాంగ్రెస్ యువ నాయకుడు అశోక్‌రెడ్డితో పాటు 300 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

లక్ష్య సాధనకు శ్రమించాలి



గండేడ్: విద్యార్థులు లక్ష్యాన్ని సాధించే వరకు శ్రమించాలని సల్కర్‌పేట్ సర్పంచ్ జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సల్కర్‌పేట్ ఉన్నత పాఠశాలలో మాజీ ఎంపీ కొండా విశ్వేశర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పేద విద్యార్థులకు ఆర్థికసాయాన్ని కేవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణవేణి పవార్, ఎస్‌ఎంసీ చైర్మన్ రామలింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులపై చర్యకు డిమాండ్

నవాబుపేట: మెడికో గిరిజన విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారణమైన సైఫ్‌ను ఉరితీయాలని బీఎస్పీ, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టి గిరిజన విద్యార్థి మృతికి కారణమైన వారిని ఎన్‌కౌంటర్ చేయాలని అన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శ్రీకాంత్, రాంచందర్, సుధాకర్, ఆంజనేయులు, గిరిజన నాయకుడు అంబదాస్ పాల్గొన్నారు.

గోడౌన్ పనుల పరిశీలన



జడ్చర్ల టౌన్: మండలంలోని నాగసాల సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోడౌన్ పనులను డీసీఓ సుధాకర్ శనివారం పరిశీలించారు. గోడౌన్ నిర్మాణ పనుల గురించి బాదేపల్లి సీఈఓ యాదగిరిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు అబ్దుల్‌అలీం, రాజేందర్‌గౌడ్, భాస్కర్ ఉన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో అనుమతి లేకుండా ప్లాట్ల విక్రయాలు, అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని సర్పంచ్ గుర్రం పార్వతమ్మ ఆరోపించారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో 541 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉందన్నారు. భూమికి పక్కనే అనుమతి లేని లేఅవుట్ ఏర్పాటు చేసి ప్లాట్లు అమ్ముతున్నారని తెలిపారు. గతంలో ఇదే సర్వేనంబర్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు భూమిని కేటాయించిన, కబ్జా చేసుకుని ప్లాట్లు చేసి అమ్ముతున్నట్లు ఆరోపించారు. గత నెల 9న ప్రజావాణిలో కలెక్టర్‌కు సైతం ఈ విషయమై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందించిన కలెక్టర్ తహసీల్దార్‌కు సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి అక్రమంగా ప్లాట్లు చేశారని నివేదిక పంపినట్లు తెలిపారు. అయినప్పటికీ అక్రమంగా నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఆంజనేయులును వివరణ కోరగా, సర్వేచేసి కబ్జా చేసిన స్థలంలో ప్లాట్లు విక్రయించిన స్థలాల్లో నిర్మాణాలను నిలిపివేసినట్లు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు.

కళాజాత ప్రదర్శన



దేవరకద్ర: మండల కేంద్రంతో పాటు మన్యంకొండ జాతరలో శనివారం ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వెన్నెల కల్చరల్ అకాడమీ కళాకారులు ఆటపాటలతో, పల్లె పాటలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మణ్, కళాకారులు రవిశంకర్, నర్సిములు, చెన్నయ్య, యాదగిరి, వెంకటేశ్, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం

కోయిల్‌కొండ: ప్రస్తుత సమాజంలో సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శ్రీనయ్య అన్నారు. శనివారం మండలంలోని సూరారం ఉన్నత పాఠశాలలో సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వైపు నడవకుండా ప్రస్తుతం ఉన్న ఆధునిక పరిజ్ఞానాన్ని మంచికి వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాములు, హెచ్‌ఎం నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ప్లాట్లలో చెత్తాచెదారం



టీచర్స్‌కాలనీలోని చిన్నపిల్లల పార్కు వద్ద ధ్వంసమైన ఓపెన్ నాలా

- అధ్వానంగా చిన్నపిల్లల పార్కు
- దెబ్బతిన్న సీసీ రోడ్లు, డ్రెయినేజీలు

వార్డు	8
జనాభా	4,817

ప్రధాన వీధులు: పద్మావతికాలనీ (కొంత భాగం), మెట్టుగడ్డ, పంచాయతీరాజ్ కాలనీ, టీచర్స్‌కాలనీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 8వ వార్డులోని ఏ గల్లీలో చూసినా ఓపెన్ ప్లాట్లు చెత్తాచెదారంతో నిండిపోయాయి. చుట్టుపక్కల వారు కొందరు మున్సిపల్ వాహనానికి బదులుగా ఈ ప్లాట్లలోనే చెత్తను పడేస్తున్నారు. దీంతో అపరిశుభ్రంగా మారి పందులకు ఆవాసంగా తయారయ్యాయి. టీచర్స్ కాలనీలోని చిన్నపిల్లల పార్కు అధ్వానంగా ఉంది. అందులో ఆడుకోవడానికి ఎలాంటి పరికరాలు లేవు. గేటు ఎప్పుడూ తెరిచే ఉంటుంది. ఆ పక్కనే ఓపెన్ నాలా దెబ్బతినగా, పందులు దుర్గంధం చేస్తున్నాయి. మూడు వైపుల నుంచి రోడ్ల వెంట వచ్చే బాటసారులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. డ్రెయినేజీలు శుభ్రం చేసిన రెండు మూడు రోజుల తర్వాతే మున్సిపల్ వాహనంలో చెత్తను సిబ్బంది తీసుకెళ్తున్నారని స్థానికులు వాపోయారు. కొన్నిచోట్ల సీసీరోడ్లు దెబ్బతిన్నాయి. పాత డ్రెయినేజీలు చిన్నగా ఉన్నాయి. ఇక పంచాయతీరాజ్ కాలనీలో రెండు మూడుచోట్ల సీసీరోడ్లు విస్తరించాల్సిన అవసరం ఉంది.



సీసీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

నడవాలంటే ఇబ్బందే..



రెండేళ్లుగా సమీపంలోని చిల్డ్రన్స్ పార్కును ఎవరూ పట్టించుకోవడం లేదు. అందులో కూర్చోవడానికి బెంచీలు లేవు. వాకింగ్ చేయడానికి వీలు లేదు. రోడ్డుపై మహిళలు, బాలికలు నడవాలంటే ఇబ్బందే. ఓపెన్ ప్లాట్లలో చెత్త వేయడంతో దుర్గంధం వెదజల్లుతుంది. నెల రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు రావడం లేదు.

– ప్రభావతి, టీచర్స్‌కాలనీ

రోడ్లు బాగు చేయిస్తాం..



వార్డు పరిధిలో పాత సీసీరోడ్లు కొన్ని దెబ్బతిని గుంతలుగా మారాయి. త్వరలోనే వాటిని బాగు చేయిస్తాం. టీచర్స్‌కాలనీలోని చిన్నపిల్లల పార్కు వద్ద ధ్వంసమైన ఓపెన్ నాలాను పునర్నిర్మిస్తాం. పార్కు నిర్వహణలో స్థానికులు సైతం భాగస్వాములు కావాలి. కొత్తగా ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయిస్తాం.

– పుల్లా నీరజ, 8వ వార్డు కౌన్సిలర్



ఓపెన్ ప్లాట్‌లో వేసిన చెత్తాచెదారం

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



రక్తదానం చేస్తున్న తహసీల్దార్ కిషన్ తదితరులు

అడ్డాకుల: ఆపద సమయంలో రక్తం కావాల్సిన వారికి రక్తం ఇచ్చే రక్తదాతలే ప్రాణదాతలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ నటరాజ్ అన్నారు. మండలంలోని శాఖాపూర్ వద్ద ఉన్న వేస్టన్ ఆంధ్రా టోల్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ టోల్‌ప్లాజా 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం టోల్‌ప్లాజా ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తహసీల్దార్ కిషన్, ఎస్‌ఐ విజయకుమార్, ప్రాజెక్టు మేనేజర్ మదన్‌మోహన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. తహసీల్దార్ కిషన్, ప్రాజెక్టు మేనేజర్ మదన్‌మోహన్‌తో పాటు సుమారు 46 మంది టోల్‌ప్లాజా సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, బాలమురుగన్, రాకేష్‌గౌడ్, దిలీప్, సుభాష్, కిరీటి, సురేందర్‌రెడ్డి, పరమేష్, రఘు, లతీఫ్ పాల్గొన్నారు.

చలో లేబర్ కమిషనరేట్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 6న చలో లేబర్ కమీషనరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో చలో కమిషనరేట్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధ సౌకర్యం కల్పించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, సెలవులు, బోనస్ గ్రావిటీ అమలు చేయాలన్నారు. వలస కార్మికులకు 1979 అంతరాష్ట్ర వలస కార్మిక చట్టం ప్రకారం హక్కులు, సౌకర్యాలు అమలు పర్చాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాకు పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరుకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలయ్య, మున్సిపల్ వర్కర్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సిములు, గోపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



జడ్చర్లలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఈఓగా సోఫియాన్, ఎంఈఓగా ఉపేందర్, ఎంఆర్‌పీగా ఫర్హాన్, హెచ్‌ఎంగా సూర్యకుమార్, పీఈటీగా యశ్వంత్‌తో పాటు మరి కొందరు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. నవీన్, వరుణ్, విఘ్నేష్‌లు ఉత్తమ ప్రదర్శన కనబర్చి బహుమతులను అందుకున్నారు.

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటిలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారారు. డీఈఓగా రవికిరణ్, ఎంఈఓగా సాత్విక్, హెచ్‌ఎంగా ఉత్తర, వివిధ సబ్జెక్ట్‌లకు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

మిడ్జిల్: మండలంలోని చిల్వేర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈఓగా మహేష్, ఎంఈఓగా మనూష, హెచ్‌ఎంగా శిరీష, మరో 31 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభకనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

సౌండ్ సిస్టమ్ వితరణ..

పాఠశాలకు గ్రామానికి చెందిన దాత బొల్లమ్ నాగరాజు రూ.20వేల విలువ గల సౌండ్ సిస్టమ్‌ను పాఠశాలకు వితరణ చేశారు. దాతను పాఠశాల సిబ్బంది సన్మానించారు.



దేవరకద్రలో..



మిడ్జిల్ మండలం చిల్వేర్ పాఠశాలలో..

దేవరకద్ర: మండల కేంద్రంలోని శ్రీవాణీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈఓగా ఆకాశ్, ఎంఈఓగా శ్రీనిధి, హెచ్‌ఎంగా రాకేశ్, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వసంత, ప్రిన్సిపాల్ భాస్కర్‌సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజాపూర్: మండలంలోని తిర్మలాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.

నిధుల మంజూరుపై ముదిరాజ్‌ల హర్షం



జిల్లా కేంద్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో ముదిరాజ్ భవన్ నిర్మాణం కోసం రూ.2కోట్ల నిధులను అందజేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాకు చెందిన ముదిరాజ్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత సంబరాలు నిర్వహించారు. శనివారం తెలంగాణ చౌరస్తాలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తెలంగాణ చౌరస్తా వద్ద క్రేన్ ద్వారా భారీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. టపాసులు కాల్చి సంబరాలు చేశారు. జిల్లా చరిత్రలో గతంలో ఎప్పుడూ లేనంతగా ముదిరాజ్ భవన్ కోసం రూ.2కోట్లు కేటాయించడంపై ముదిరాజ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముదిరాజ్ భవన్ కోసం రూ.2కోట్లు కేటాయించడం గొప్ప విషయమని ముడా చైర్మన్ గంజి వెంకన్న అన్నారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి ఓర్వలేకే విమర్శలు..

జిల్లా కేంద్రంలో గతంలో ఎప్పుడూ లేనంత అభివృద్ధి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపడుతున్నారని, కొందరు అభివృద్ధిని చూసి ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ అన్నారు. ముదిరాజ్ భవన్ కోసం రూ.2కోట్లు కేటాయించినందుకు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్, మత్స్య సహకార సంఘం ఇన్‌చార్జ్ సత్యనారాయణ, హన్వాడ ఎంపీపీ బాలరాజు, ముదిరాజ్ మహాసభ మండల ప్రధాన కార్యదర్శి యాదయ్య, నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్థానిక న్యూమోతి నగర్‌లో ముదిరాజ్ నాయకులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ కార్యదర్శి పడాల శేఖర్, విజయ్‌కుమార్, గిరి, బీఆర్‌ఎస్ నాయకులు నరేష్, శ్రీనివాసులు, వెంకటయ్య పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సినీనటుడు సుమన్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఇటీవలే జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన 4వ జాతీయస్థాయి ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ పట్టణానికి సమీపంలోని కేశవరెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు సీనియర్ మాస్టర్ సయ్యద్ అశ్వాక్ తెలిపారు. ఈ పోటీల్లో కటాస్‌లో ఎండీ రజాక్, తమన్ బంగారు పతకాలు, కుమితేలో భరత్‌గౌడ్ బంగారు పతకం, రుపేష్ రజత పతకం సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సినీనటుడు సుమన్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పతకాలు సాధించిన విద్యార్థులను కేశవరెడ్డి స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్ సయ్యద్ అశ్వాక్, వీఐపీ బ్లాక్ బెల్టు ఆర్గనైజేషన్ సంయుక్త కార్యదర్శి సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్యదర్శిగా సుధాకర్‌గౌడ్

బాలానగర్: మండలంలోని నేరళ్లపల్లికి చెందిన సుధాకర్ గౌడ్ మహబూబ్‌నగర్ జిల్లా వీఐపీ బ్లాక్ బెల్ట్ ఆర్గనైజేషన్ కార్యదర్శిగా నియామకమయ్యారు. వీఐపీ రాష్ట్ర చైర్మన్, సినీనటుడు సుమన్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు సుధాకర్ గౌడ్ తెలిపారు.

కరాటే శిక్షణా తరగతులు ప్రారంభం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని పోలీస్ లైన్ ఉన్నత పాఠశాలలో బాలికలకు శనివారం కరాటే శిక్షణా తరగతులను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మసూద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల మానసికంగా ధృడంగా ఉండవచ్చని అన్నారు. బాలికలకు రాష్ట్ర స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ ఎతినె చెన్నయ్య కరాటే శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో పీఈటీ దత్తు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐ రాజేశ్వర్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగాలని రూరల్ సీఐ రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కోయిలకొండ, నవాబ్‌పేట్, హన్వాడ, మహ్మదాబాద్ ఎస్‌ఐలతో నేరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, రవి, పురుషోత్తం, సైదయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచాలి



గుండేడ్‌లో ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

బాలానగర్: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ కృష్ణారావు సూచించారు. మండలంలోని గుండేడ్, జీడీగుట్ట తండాల్లో ఆయన పర్యటించి ఈజీఎస్ పనులను పరిశీలించారు. హరితహారంలో భాగంగా నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం బ్యాగ్ ఫిల్లింగ్ పనులు త్వరగా పూర్తి చేసి వర్షాకాలం నాటికి మొక్కలు పీట్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం విత్తనాలు నాటాలని సూచించారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ఆటాపాట



స్పీడ్‌వాక్ పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

మహబూబ్‌నగర్ రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలోని పాత ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో పాటు సఖి, ఐసీపీఎస్ విభాగాల అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మ్యూజికల్ చైర్స్, మార్బుల్ స్పూన్, స్పీడ్ వాక్, పీక్ అండ్ డూ, స్కిప్పింగ్ తదితర క్రీడలు నిర్వహించారు. క్రీడలను డీడబ్ల్యూఓ జరీనాబేగం ప్రారంభించారు. కార్యక్రమంలో సీడీపీఓలు కె.రాజేశ్వరి, ఎల్.శాంతిరేఖ, శైలాశ్రీ, మెహరునిస్సాబేగం, టీఆర్‌టీ కోఆర్డినేటర్ వెంకటమ్మ, డీసీపీఓ నర్మద, సఖి అడ్మిన్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిద్దాం



మాట్లాడుతున్న దుర్గావాహిని ప్రతినిధి సింధూజ

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రతి యువతి దుర్గావాహినిలో చేరి దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం నడుంబిగించాలని దుర్గావాహిని ప్రతినిధి సింధూజ అన్నారు. జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో శనివారం విశ్వహిందూ పరిషత్ దుర్గావాహిని ఆధ్వర్యంలో నారీ సురక్ష–జాతి పునర్నిర్మాణంలో యువతి పాత్ర' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింధుజ మాట్లాడుతూ దుర్గావాహిని యువతకు సేవా సురక్ష అనే విషయాలపై మార్గదర్శకం చేస్తూ ఆత్మరక్షణ కోసం అనేక విద్యలను నేర్పిస్తుందన్నారు. తమ జ్ఞానాన్ని పరీక్షలపై దృష్టి సారించి ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ, భజరంగ్‌దళ్ ప్రముఖ్ సంపత్, భరత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మల్లమ్మ ఉత్సవాలు



పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల సమీపంలో గల మల్లమ్మ ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మ్యాదరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలకు జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి పూజలు చేశారు. కౌన్సిలర్ నవనీత, విజయ్‌కుమార్, లత పాల్గొన్నారు.

భూములను పరిరక్షించాలి

జడ్చర్ల టౌన్: వెంచర్లకు సంబంధించి మున్సిపాలిటీ పరిధిలో పదిశాతం భూస్థలాలు కాపాడాలని కమిషనర్ మహమూద్‌షేక్‌కు సామాజికవేత్తలు అనిల్‌కుమార్, అయ్యన్న శనివారం కోరారు. గతంలో అనేకమార్లు ఈ విషయంలో విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. అదేవిధంగా గాంధీట్రస్టు భూములు, వెంకటేశ్వర స్వామి ఆలయ భూములు సైతం పరిరక్షించాలన్నారు. ఎర్రగుట్టలో గతంలో నిరుపేదలకు ఇచ్చిన భూములను కొందరు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.

6న హ్యాండ్‌బాల్ పోటీలు

జడ్చర్ల: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న మండలంలోని కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్ ప్రాంగణంలో హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 01-01-2007 తరువాత జన్మించిన వారు తమ ఆధార్ కార్డు, బోనఫైడ్‌తో హాజరు కావాలని కోరారు.